గుడిపాటి వెంకటచలంతో

చలంగారు ఒక చినిగిన పాత చీరముక్క లుంగీగా చుట్టుకుని పైన ఒక గళ్ళ బుష్షర్టు వేసుకుంటారు. పిండి రుబ్బుతూ లేచి వచ్చినట్లున్నారు. గడ్డం మాసింది బాగా, జుట్టు రేగివుంది. ముఖం ఈశ్వర తేజస్సుతో వెలిగిపోతూ వుంది.

మధుర: నేనెవర్నో పోల్చుకోలేరా?

చలం (నవ్వి): నువ్వు ఎంకి పక్క నిల్చోతగ్గ దానవు ఎంకివి కావు మహాపతివ్రతవు కావు ఊర్వశివో, వసంత సేనవో

మధుర: గెయిషాని కాన్నేను. అప్పారావుగారి అందమైన పాపన్ని.

చలం: Colourless iniquity ఇంత లేటుగానా రావటం?

మధుర: శ్రీశ్రీని విశ్వనాథని వీళ్ళందర్నీ ముల్చుకుని వచ్చేసరికి యింత ఆలస్యమయింది.

చలం: నీ దగ్గరకి వచ్చే వాడి కళ్ళు మూసుకుపోవటం వెళ్ళేవాడి కళ్ళు తెరుచుకోవటమూ సహజమే

మధుర: సౌజన్యారావు పంతులు గారి ఆలోచనకు అందని సంగతులు మీరు ఆలోచిస్తారని

చలం: సంస్కరించేటప్పుడు తప్ప సాంఘిక చట్టాల్ని మీరడం నేరమన్నారు అప్పారావుగారు. వివాహబంధాన్ని తృణప్రాయంగా మీరే వారందరూ సంఘపూజ్యులే ఇట్లా మీరే సంసార బంధం వల్ల లాభమేమిటి?

మధుర: అలా మీరనవసరం లేకుండా మనుషులు దొంగలు కాకుండా సంస్కరించమన్నందుకు మిమ్మల్ని సాంఘిక, వాఙ్మయ, నైతిక బహిష్కారానికి గురిచేశారు అవునా?

చలం: ఆయన అన్న మాటల్నే సరిగా నేను అన్నందుకు కోపం నా మీద ఏదో ఉద్రేకంలో ఉపోద్ఘాతాలు నేనడక్కుండానే వ్రాసి పశ్చాత్తాప పడేవాళ్ళూ, నన్నిష్టపడే వాళ్ళ వద్దపొగిడి, ఇష్టంలేని వాళ్ళ వద్ద తిట్టే వాళ్ళూ, ''మనిషి ఫరవా లేదుగాని ఆ వ్రాతలు'' అనే వాళ్ళూ, ''వ్రాతలతో ఆగితే బాగా వుండును'' అనే వాళ్ళూ - - ఇట్లాంటి మిత్రులకన్నా పడ పడ దూషించే విరోధులెంత ఉపకారులు?

మధుర: మీరు ఆంధ్రా యూనివర్సిటీ నవలల పోటీకి వేయి పడగలు నారాయణరావుతో దీటుగా నవల పంపారట ఏవిటిది?

చలం: మైదానం లూ యీ సిన్క్లర్ ఓసారి అన్నాడు. మర్యాదకీ ధనవంతుల పద్ధతికీ ఎదురు తిరిగి రాస్తే ప్రతిభకల రచయితని అమెరికాలో కొనేస్తారట! లొంగిపోతే వెలేసి అనామకుణ్ణి చేసి అతని గొంతు పిసికేస్తారు. నన్నూ పనిచెయ్యలేకపోయారు యిక్కడ

మధుర: మరి ఆర్టిస్టుకి పాప్యులారిటీ మీద ధ్యాస వుంటుంది కదా!

చలం: వాడు దేవుళ్ళాడేదే పాప్యులారిటీ కోసం అతన్ని ఆర్టిస్టు కాకుండా చంపేదే ఆ పాప్యులారిటీ మర్యాదస్తుడివైపో నీకు దాసుల మవుతాం అంటారు ఏ టాగూరులాటి వాడో బెర్నార్డ్‌షాలాంటి వాడో లొంగరు వాళ్ళకు, లోకం కళని చిన్నతనంలోనే చంపేస్తుంది

మధుర: ఎట్లా వచ్చాయి ఎంకి పాటలు?

చలం: ఎట్లా వొచ్చాయో ఒచ్చాయి ఒక్క గుంపుగా ఆయన హృదయాన్నిచీల్చుకుని, మరోలోకపు హంసల వలె ప్రతి వారిలో భయపడి దాక్కుని వున్న శృంగార రేఖలు మామూలు దుమ్ముని చీల్చుకుని తలలెత్తి చూశాయి

మధుర: ఏం చేశాయవి?

చలం: ఏం చేశాయా? దేశంలో యింత గాలి దుమారం రేపి, కవిత్వపు చెత్తనంతా వూడ్చి కడుపులు మండించాయి మడి కట్టుకుని వంటింటో కూచుని తానే శుచి అని విర్రవీగే కవిత్వాన్ని జుట్టు పట్టుకుని తోటల్లోకి చేలల్లోకి లాగాయి

మధుర: అప్పుడు ఎంకి ఏం చేసింది?

చలం: ఆగ్రహంతో శపిస్తామన్నారు పండితులు నన్ను తీసుకుంటారా నడ్డి విరగొట్టనా అని బెదిరించింది రసికులందరూ ఎంకి వెంటపడ్డారు ప్రతి వారిలో భయపడి దాక్కుని వున్న శృంగార రేఖలు మామూలు దుమ్ముని చీల్చుకుని తలెత్తిచూశాయి

మధుర: కవిగారు ఏవంటారు?

చలం: ఎంకొక్క దేవతై ఎలిసెనంటారు ధిక్కారంలోకి దిగి ఎంకి ఆధిక్యత నిలిపారు ఈ లోపల కవి యెదిగారు, వయసులోనే కాదు, అనుభవంలో, మర్యాదలో, కీర్తిలో, మన్ననల్లో '' ఎంకి అన్న అపవాదు, ఈనాటిదే కాదు ఎన్నటికి పోదు'' అని విలపించాడు కవి

మధుర: ఎంకి మారిందా?

చలం: ఎంకిని తీర్థయాత్రలుకు పంపారు గంగాస్నానం చేయించారు విశ్వేశ్వరుడి తల తడిమించి, ఆశీర్వచన మిప్పించారు కాని, నీ వాక్కు నిన్ను పట్టేస్తోంది నీకోకులం వంశం లేవు అన్నారు ఊర్వశి, హృదయేశ్వరి, కాంతం, కిన్నెరసాని, తెలుగుతల్లి పక్కన కూచోనియ్యలేదు ఎంకిని

మధుర: అప్పుడు వూరుకున్నారా సుబ్బారావుగారు?

చలం: నా ఎంకిని మీ సహపంక్తిని కూచోనియ్యరా! సరే, నాకూతురికి కులాన్నిస్తాను ఈమె శృంగార దేవత ఈమె మహాప్రతివ్రత అయినా సరే నీ వంశం నీ మాటా అని తోసేశారు కిందికి కవితాస్వర్గం నుంచి కవిబ్రహ్మ మండి పడ్డాడు నీకో లోకం సృష్టిస్తానన్నాడు సృష్టికి ప్రతిసృష్టి జరిగింది ఆ లోకానికి రాణి ఎంకి

మధుర: ఎంకి మారిందా?

చలం: వాళ్ళు నిజంగా రాజా రాణీ అయ్యారు. పూర్వంమల్లే ఆడుకోవడమూ, వుత్తుత్త విరహాలు పడడమూ, చిన్నచిన్న శృంగార చేష్టలూ యిప్పుడు సిగ్గరి పనులయ్యాయి ఆత్మల మన్నారు ప్రియులమని మరిచి దేవత్వం పూనారు. ఇప్పుడు కావి రంగు మడిబట్టకట్టుకుని కాళ్ళు ఎత్తి ఎత్తివేస్తుంది తోటల్లో పరుగులెత్తదు. నవ్వదు గెంతదు కళ్ళు ముయ్యదు

మధుర: ఇదంతా సుబ్బారావుగారికి తెలుసా?

చలం: సుబ్బారావుగారు తెలుసుకోని దేమంటే, తాను పాట రాసినా, ప్రధమం నించి ఆ పాటకూ మామూలు శృంగారపు గీతం కాదు - వాటికి ఓ ఆత్మ వైశాల్యం, ఓ గంధర్వ విలాసం పట్టింది అందువల్లే పల్లె పాటలకి లేని ఆధిక్యత ఎంకి పాటలకి పట్టింది ఎంకి మొదటి నుంచీ యీ ప్రపంచాన్ని మించిన శృంగార వీధుల్లోనే విహరించింది ఎంకి ప్రజల మనిషి కాదు ప్రజల మన్ననలకి ఎన్నడూ ఆశించలేదు ఆమె. అసలు ట్రాజిడీ ఏమిటంటే ప్రజా వాఙ్మయం కింద ప్రజలు తీసుకోలేదు సాహిత్యం కింద పండితులు తీసుకోలేదు

మధుర: పోన్లేద్దురూ ' ఎంకెవ్వరని లో:మెపుడైన అడిగితే వెలుగు నీడల వేపు వేలు సూపింతు' అన్నారు కవి

చలం: కవి మారినపుడల్లా పాత్రకి నగిషీలు చెక్కుతూ కూర్చుంటే కొన్ని ఎదురు తిరుగుతాయి ఎంకికి Sophistication వస్తే యింకే ముంది? బారిష్టర్ పార్వతీశం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి అయినట్లు

మధుర: పాత్ర రచయితని మించిపోతే వస్తుంది చిక్కు దానికి ప్రత్యేక వ్యక్తిత్వం వస్తుంది అల్లా వస్తే అది మీ చెప్పు చేతల్లో యిముడదు నాకు మల్లే -

చలం: ఆ పాత్రను సృష్టించిన రచయితే చివరికి దానికి విరోధిగా మారతాడు పితృవాత్సల్యం చేత - అవి ఎదురు తిరుగుతాయి కూడా కాంతం వృద్ధాప్యం రాసి మునిమాణిక్యం వారు ఆ తప్పే చేశారు

మధుర: నాకు వయసుందా? అప్పుడెలా వున్నానో యిప్పుడూ అలానే వున్నా - మాకు డిప్రీసియేషన్ వుండదు వుంటే అప్రీసియేషనే కాని మాతో బాటు మమ్మల్ని సృష్టించిన మీరూ వుంటారు మీరు గీత దాటితే-

చలం: కూతురి సారె గదిలోకి తొంగి చూసినట్టు

మధుర: ఛీఛీ మాట మారుస్తా! మాలపిల్ల సినిమాలో గాంధీగారి మీద బసవరాజు గారి పాట వినిపించారు, గుర్తుందా?

చలం: గుర్తుండకేం? కోమటైబుట్టితేనేమీ, మా గాంధి మాలడై తిరిగితేనేమీ అని, ఏవిటా లేకి మాటలు? అయినా గాంధీని అంగీకరిస్తామని వెధవ కండిషన్లు కుల ప్రసక్తి తేవడం నీచాతినీచం కదా!

మధుర: మీరే అలా అనుకుంటే యిక నేనేమనాలి?

చలం: అప్పుడప్పుడు అనిపిస్తుంది - జీవితంలో విరామం లేని క్షోభనంతా యెందుకు తెచ్చి పెట్టుకున్నానా - అని నన్ను ప్రేమించిన పెద్దలకి, ప్రియురాళ్ళకి, స్నేహితులకి, పిల్లలకి, కష్టం, విచారం, కోపం ఎందుకు తెప్పించాను? ఎందుకు పడ్డాను ఇన్ని కష్టాలు, యీవెలి, యీ నింద, యెన్నటికీ మాయని యీ అపవాదులు?

మధుర: మీరు సత్యమని నమ్మిన దాని కోసం

చలం: పర్యవసానం? ఏమీ కనపడదు విడవని వ్యధ తప్ప లేని సత్యమనేది వుండనీ వుండక పోనీ, నేను యేనాటికి యేది సత్యమనుకున్నానో దాన్ని అనుష్ఠించకుండా నిలవలేదు

మధుర: చిన్నప్పుడే ఆడపిల్లల గొడవల్లో పడ్డారటగా - మీ మొదటి గొడవ గుర్తుంటే చెప్పండి

చలం: "Mమొదటిసారి నా కళ్ళపడ్డప్పుడు, చిన్నది - యింకా పన్నెండేళ్ళు లేవు రెండు మాటలేవో, మాట్లాడగానే ' ఇన్నాళ్ళెక్కడ దాక్కున్నావు నాకు కనపడక' అన్నా ఓసారి స్తంభం పక్కన ఆమెని ముద్దు పెట్టుకుంటో వుంటే చూసి భ్రమపడ్డారు ''నేను పెళ్ళి చేసుకుంటాను'' అని అరవబోయి సిగ్గుతో నోరు మూసుకున్నా ఎండాకాలపు మధ్యాహ్నాలు, నేను "B" పాకలో మా పెట్టెబండి విడిచి వుంటే, దాంట్లో యెక్కి కూచునే వాళ్ళం వెడతానని అనకుండా ఓపికగా గంటల కొద్దీ కూచునేది. ఆమె బుజానికీ, బండికీ మధ్య నావేలు నలుగుతోంది మెల్లగా నా మెడ కింద ఆమె పెదిమలు కదిలాయి అది ముద్దు అవునా కాదా అని

మధుర: యీనాటికీ తర్కించుకుంటూ వున్నారు పాపం

చలం : యిప్పుడు అడగితే బాగుండదు మర్యాదస్తురాలు, పెద్ద కుటుంబానికి అధికారి యేమంటుంది?

మధుర: మీ చిన్నతనం .

చలం: ఎదుగుతున్న ఆడపిల్లలతో, ఆటలతో, సరసాలతో నాటకాలతోనే గడిచింది ఆ కాలం. చిన్నప్పటి నుంచి దూరంగా వుండే నా బాలమిత్రురాళ్ళ కోసం యేడ్చే వాణ్ని.

మధుర : మరి అంత చిన్నప్పుడే పెళ్ళి ఎందుకు చేసుకున్నారు?

చలం: చిన్నప్పుడేవిటి? 1911 లో స్కూల్ ఫైనల్ చదివే నాటికి పెద్దల బలవంతంతో నా పెళ్ళి జరిగింది, కారణం లేకుండానే నాకు పెళ్ళి అంటే అయిష్టం అదిగాక అప్పటికే నాకు ముగ్గురు చిన్న పిల్లల మీద ప్రేమ కుల వివాహ పట్టింపుల వల్ల చేసుకోలేను వాళ్ళతో కలిసివుండటానికి వీల్లేదు. ఎంతో బాధపడుతున్నా, గుంజుకున్నా నాకు పెళ్ళి వద్దని గోలపెట్టా. పారి పోదామని అనుకొన్నా, ఇల్లు కదలనివాడిని, సుకుమారిని, అర్భకుణ్ని. అనారోగ్యుణ్ని నేనెక్కడికి పోగలను?

మధుర: మీ యింటి పేరు గుడిపాటి ఎలా అయింది?

చలం: మాతామహుడు గుడిపాటి వెంకట్రామయ్యగారు సెటిల్‌మెంటు ఆఫీసరుగా రిటైరయారు. దివాన్ బహద్దరు కూడా. ఆయన నన్ను దత్తత తీసుకున్నారు. మానాన్న కొమ్మూరి సాంబశివరావు వెంకట సుబ్బమ్మ మా తల్లి. నాకు పుట్టుకతో పార్శ్వపుతలనొప్పి (మైగ్రేన్) వుండేది

మధుర: ప్రేమకోసం ప్రేమించబడడం కోసం అంత యావ చిన్నప్పుడే ఎలా ఏర్పడింది?

చలం: మా నాన్న అస్తమానూ నన్ను కొట్టే వాడు. చదువు పేరు చెప్పి కొట్టేవాడు నా చిన్నతనమంతా అనారోగ్యంతో తండ్రి పట్ల ద్వేషంతో గడిచింది నేను అమ్మానాన్నల ప్రేమ ఎలాంటిదో ఎరుగను ఆ కఠిన తరమైన గాఢముద్ర ద్వేషం తరువాత జీవితంలో ప్రేమ కోసం, ప్రేమించి ప్రేమించబడటం కోసం అన్వేషణగా మారిందనుకుంటా

మధుర: మీరు చిన్నప్పుడేవో ప్రతిజ్ఞలు చేశారట?

చలం: యెన్నటికీ పెళ్లి చేసుకో గూడదనీ, పెద్దవాళ్ళు బలవంతాన చేసినా పిల్లల్ని కనగూడదనీ, పిల్లల్ని కన్నా వాళ్ళను యేడ్పించకూడదనీ, వాళ్ళు యేడ్చినా యేమైనా సరే, వాళ్ళను కొట్టగూడదనీ అనుకున్నా తీవ్రంగా.

మధుర: మొక్కపాటి రామమూర్తి ఎవరు? రత్తమ్మ.

చలం: రామ్మూర్తా? బారిస్టరు పార్వతీశం రాసిన మొక్కపాటి నరసింహశాస్త్రిగారి తమ్ముడు. బ్రహ్మ సమాజంలో కలిసి మాతో వున్నాడు. కృష్ణశాస్త్రి కృష్ణపక్షం ముద్దుకృష్ణ వైతాళికులు అంకితం తీసుకున్న గొప్ప మిత్రుడు నేను నా మొదటి నవల శశిరేఖని రామ్మూర్తికే అంకితం యిచ్చాను

మధుర: కృష్ణశాస్త్రి ఊర్వశికి. . .

చలం : అవును, రత్తమ్మ రామ్మూర్తి మరదలు కొన్నాళ్ళు నావద్ద పాఠాలు చెప్పించుకొనేది మేమిద్దరం ఆబలమైన ఆకర్షణ నుంచి బైటపడలేకపోయాం రామ్మూర్తి చాలా బాధకు గురయ్యాడు చలానికి దూరమయినా మళ్ళీ కలుసుకున్నాడు. చివరికి సూళూరు పేట రైల్వే ఆక్సిడెంట్‌లో రత్తమ్మ పోయింది పాపం

మధుర: రామ, రామ! మీ ఆదర్శ స్త్రీ

చలం: లోప రహితమైనది, ఈ భూమి Limitationsని మించి సంచరించేది, ఓ స్త్రీ నాతో మెలుగుతో వుండేది ఆమె నా స్వప్నచారిణి. ఆమె యీ భూమిమీద అలభ్యమని తెలుసు. అందుకనే నేను ప్రయత్నించి, ఉన్నతుణ్నయి, ఆమెను అందుకోవాలని చూసే వాణ్ని నేను వాంఛించే వెలుగూ వైశాల్యం అన్నీ ఆమెలో లభ్యమవుతాయని ఆశపడే వాణ్ని. ఎక్కడ, ఎక్కడ, ఎక్కడ? అనే అన్వేషణ నన్ను ఆవరించింది.

మధుర: దీక్షితులు గారికి మీకూ ఎలా కలిసింది?

చలం: రాజమండ్రి ట్రయినింగ్ కాలేజీలో 1922-23 ప్రాంతాలలో టీచర్‌గా వుంటున్నప్పుడే దీక్షితులుగారితో పరిచయం అయింది. నా చేత రుక్మిణి అనే మొదటి కథ రాయించి

కొడాలీ ఆంజనేయులు గారి సాహితిలో వేసేలా చూశారు. నన్ను కథకుడుగా ఆంధ్ర దేశానికి పరిచయం చేసింది వారే. 1936లో నన్ను రమణ మహర్షి దగ్గరకు తీసికెళ్ళి భగవాన్‌ని పరిచయం చేసింది దీక్షితులు గారే. అంతా నన్ను తిట్టే రోజుల్లో సనాతనుడైనా సూనృతంతో, నిష్కాపట్యంతో, నన్ను సమర్థించే వారు

మధుర: మీరు బ్రహ్మ సమాజంలోకి ఎలా వెళ్ళారు?

చలం: రఘుపతి వెంకటరత్నం నాయుడు గారంటే నాకు భక్తి, ప్రేమ, గౌరవం ఆయన వల్ల నా జీవితం నైతికంగా ఆధ్యాత్మికంగా చాలా ప్రభావితం అయింది నేను కాకినాడ కాలేజీలో చేరి బ్రహ్మసమాజ ప్రార్థనలని చూడగానే నాకు చాలా సహజమైన చోటుకి వొచ్చినట్లు అనిపించింది నాకు నీతి వర్తన మీదపట్టుదల ఎక్కువయింది నాశశిరేఖ నవలలో కొంత వుంది ఆ గొడవ

మధుర: మళ్ళీ అందులోంచి ఎలా బయటికి వచ్చేశారు?

చలం: జీవితంలో నైతిక సమస్యలు ఏర్పడేటప్పటికి ఈశ్వరుడిపై ప్రశ్నలు బయలుదేరాయి రత్తమ్మ కారణం బయటికి కొచ్చెయ్యడానికి భార్యతో లేని పాపం ఇంకోక స్త్రీతో పాపం యెట్లా అయింది?

మధుర: అసలు మీకీ ఆడవాళ్ళ గొడవ ఎందుకు పట్టిందీ?

చలం: నేను చదువుకునే రోజుల్లో నా పెద్ద చెల్లెలు అమ్మణ్ణికి భర్తపట్ల ఆమె కిష్టం లేకున్నా శోభనం ఏర్పాటుచేశారు అప్పుడు మా బావకి ఉత్తరం రాశాను ఆమెకిష్టం లేదు రావద్దని ఆ రాత్రి అమ్మణ్ణిని గదిలోకి పంపేవరకు యత్నించాం అడ్డుపడదామని కాని అమ్మణ్ణి లొంగిపోయింది మేమేం చెయ్యలేక పోయాం మా నాన్న నన్ను కొట్టడానికి వచ్చాడు తిరగబడ్డాను బైటకి గెంటారు గర్భాదానం గదిలో ఆడపిల్లలు ఎట్లా మారిపోతారో ఆశ్చర్యం వేస్తుంది ఇది నా స్త్రీ విమోచనా సంగ్రామానికి ప్రేరణ

మధుర: మీ జీవితంలో అనేక మంది స్త్రీలు వచ్చి వెళ్ళారు ఇంతమందితో ప్రేమ ఎట్లా సాధ్యం?

చలం: ఎంత ప్రయత్నించీ శృంగార వాంఛని ఈనాటి వరకూ జయించలేకపోయాను అదేలేకపోతే నేను ఎందుకు బతికి? స్త్రీతో కొన్నాళ్ళు స్నేహమైతే, మాలోని శృంగార భావం పాతబడి, ఇంక నన్ను ఆకర్షించడం మానేసేది అప్పుడు యింకో కొత్త శృంగార సంబంధం కోసం కొట్టుకునే వాడ్ని. ఇది గొప్ప ప్రేమా కాదు ఉత్తకామమూ కాదు. ఇవన్నీ వాంఛలూ విరహం ..

మధుర : మీరు ఆడపిల్లలతో వున్నప్పుడు చాలా చలాకీగా కలిసీ మెలసీ వుండేవారనుకుంటా-

చలం: అదంతా Calf love (లేగ దూడ ప్రణయం) హైస్కూల్లో నా పన్నెండవ యేట నొక అమ్మాయికి ప్రేమలేఖ కూడా రాశా. ఆడపిల్లలతోనే ఎక్కువ స్నేహం. Life is a habit బళ్ళో నా స్నేహితులకి నన్ను చూడగానే నిష్కారణమైన అయిష్టం. నా జాతకంలో జనద్వేషానికి గురికావాలని వుంది కాబోలు.

మధుర: మీ ఆదర్శ స్త్రీయేమైంది?

చలం: ఆదర్శ పురుషుడు లేకుండా ఆదర్శ స్త్రీ యెక్కడ్నుంచి వొస్తుంది? ఇది తెలుసుకోటానికి నాకు చాలా కాలం పట్టింది.

మధుర: మీ అభిప్రాయాలతో వేరుపడే నాటిపెద్దల గురించి ఏమంటారు?

చలం: (నవ్వి) వాళ్ళా ఆ దయాపరులు రక్తం చూస్తే భరించలేని(... .)వీళ్ళందరిలోనూ యెంతెంత క్రూరత్వం దాక్కొని వుందంటావు? ఆ వేట కోర్కెలని తీర్చుకోక, దాచుకొని, ఉన్నదని కూడా తెలీక, పిట్టల మీద, మృగాల మీద చూపని ఆక్రౌర్యాన్ని, మనుషుల మీదా, కోర్టులలో, ఆఫీసుల్లో యిళ్ళలో తీర్చుకుంటారు కక్షలు కట్టి, మృగాల బదులు మనుష్యుల్ని, ధనాన్ని, పదవుల్ని వేటాడుతున్నారు. పిల్లల మీద, భార్యమీద, నౌకర్ల మీద చూపుతారు కసి. వీళ్ళందరూ శాకాహారులే భూత దయాపరులే-

మధుర: ఆంధ్ర విశ్వవిద్యాలయం సెనేట్‌లో రామలింగారెడ్డి గారిని చూడగానే ఏమనిపించింది మీకు?

చలం: ఆయన్ని చూడగానే నా కళ్ళు చెదిరాయి. నేను స్త్రీనయితే సంసారాన్ని వొదిలి,, ఆయన కోసం వెళ్ళి వుందును!

మధుర: రామ్మూర్తి చనిపోయాడని టెలిగ్రాం రాగానే మీకేమనిపించింది?

చలం: ఈ సంగతి రామ్మూర్తితో చెప్పాలి. అని బతికివున్న వాళ్ళు మనతో తగాదా లాడి విరోధులు కావచ్చు. పెళ్ళిళ్ళు చేసుకుని మర్యాదస్తులయి మనకి దూరం కావచ్చు. కాని మనం ప్రేమించిన వాళ్ళు మృతి పొంది మన స్వంత మయిపోతారు.

మధుర: స్త్రీల చూపుల్ని గురించి చెప్పండి, (నవ్వు); ఎలా చెబుతారో విందామని

చలం: పురుషుణ్ణే వెదుక్కోడానికి అలవాటయిన స్త్రీ చూపులు అదో విధం. (వేశ్య చూపు వేరు. అవి ధనం కోసం వెతుకుతాయి) ఈ స్త్రీల చూపులు మోహం కోసం - కాదు 'అవయవాల కోసం వెతుకుతున్నాయా' అన్నంత అసహ్యంగా వుంటాయి కొంతమంది స్త్రీలలో ఆకర్షణ- ఎంతయినా కళ్ళ వేపూ పెదవుల వేపే నిలుస్తుంది

మధుర: పాపం పోతనగార్ని ఏడిపించారటగా (నవ్వు)

చలం: అవును, 'కన్నుదోయికి అన్యకాంతలడ్డంబైన మాతృభావన సేసిమరలు వాడు' అన్నాడు పోతన, ప్రహ్లాదుడ్ని గూర్చి. ఐదేళ్ళ పిల్లాడికి అన్ని ఆలోచన్లా అని విస్తుపోయా

మధుర: మీది శ్రీరాముడి పార్టీయా? శ్రీకృష్ణుడి పార్టీయా ?

చలం: తన ధర్మమేదో రాముడికి తెలీదు. ప్రజలు తప్పు అనుకున్న దాకా చరబడ్డ భార్యని స్వీకరించి గర్భవతిని చెయ్యడంలో యేమీ వికృతం కన్పించలేదు అతనికి. సీతని పరిత్యజించాలని వశిష్ఠుడు బోధించిందాకా ఆచక్రవర్తికి కర్తవ్యం తేలీలేదు . ఇన్ని శాస్త్రాలు చదివిన ఆ ధర్మస్వరూపుడికి, తన కర్తవ్యం తెలిసినంతరవాతయినా, సీతతో యెదుట పడి

మాట్లాడలేదు. అతని బాధనీ, ధర్మనిష్ఠనీ, అంత మహాపతివ్రతా అర్థం చేసుకోదని భయం పిల్లల కోసమన్నా తగాదా పెడుతుంది. అందుకని ఆ అ బద్ధం వాల్మీకి ఆశ్రమం చూపిస్తామని. ఈ ఘోరాలన్నిటిలోనూ రాముడు యెంత అల్పుడయినాడో ఈనాటికీ తెలీదు ప్రజలకి.

మధుర: అట్లా ధర్మానికీ హృదయానికీ మధ్య మధనపడే పాత్రని సృష్టించాలనుకున్నాడేమో వాల్మీకి

చలం: అట్లా అంటే తగాదా యేదీ? ఆదర్శపురుషుడు అంటేనే తను శ్రీకృష్ణుడే అయితే ఎవడివిరా నా భార్యనే యెంచుతావా?' అని వాణ్ణి హతమార్చి వుండును. ఎన్నటికీ వశిష్ఠుడ్ని అడగడు అసలు నోరెత్తనీడు. ఒక్క సీతతో రాముడికి ఇన్ని సమస్యలు. పదహారు వేల మందితో ఏ సమస్యాలేదు శ్రీ కృష్ణుడికి నువ్వు విష్ణుమూర్తి అవతారానివి అనిచెప్పాలి శ్రీరాముడికి- తనే భగవంతుణ్ని అని శ్రీ కృష్ణుడికి తెలుసు

మధుర: గాంధీ గార్ని గురించి మీరే మంటారు?

చలం: మహాపురుషులు ప్రపంచానికి రెండు విధాల ఉపకరిస్తారు ఒకటి కార్యాలవల్లా, బోధనల వల్లా రెండోది · తమ దర్శన సాంగత్యాల వల్లా గాంధీగారిని ఎరిగిన వారు ఆయన పనులకన్నా వ్రాతలకన్న ఆయన గొప్ప వారంటారు. అంటే నిజమైన గొప్పదనం సంపాయించారన్న మాట ఎందుకంటే మనిషి లోపలి గొప్పతనం ఎంత సంపాయిస్తే అంత విలువా, బరువూ అతని పనులూ మాటలూనూ ఈ సంగతే చాలామంది ప్రజానాయకులు గమనించరు

మధుర: వీరేశలింగం గారు ఏమవుతారు మీకు?

చలం: ఏ పద్ధతిలో నన్నా ఒక మూల గట్టిగా వూపే యోధుడు బైలుదేరాడు తక్కిన బిల్డింగు అంతా త్వరలోనే కూలుతుంది వితంతు వివాహాలు సాధించిన వీరేశలింగంగారు స్త్రీ నీతి చట్టాల్ని వెక్కిరించిన 'చలం'కి స్పిరుచ్యువల్ ఫాదర్

మధుర: కథలు బాగా రాయటానికి చదువుకోవాలా?

చలం: చదువుకోకపోతే యింతకన్న మంచికథలు రాద్దును రాయగల టాలెంట్ మనిషిలో వుంటే, చదువూ పాండిత్యం చాలా అనవసరం.

మధుర: శ్రీశ్రీ మీకు ఎట్లా పరిచయం?

చలం: రుక్మిణీనాథశాస్త్రిగారు నాకు శ్రీశ్రీ కవిత్వాన్ని తెరిచారు

మధుర: కమ్యూనిజం గురించి మీరేమంటారో వినాలని వుంది

చలం: కమ్యూనిజంలో వుండే గొప్పశక్తి యేమిటంటే, ఏ విషయాన్నయినా సరే = ఆరోగ్యము, విద్య, ఆర్థిక విధానము, దేవుడు, నీతి, దేనికయినా సరే - పాత బూజుల్ని దులిపి, ఈనాటి ప్రజాక్షేమపు దృష్టితో చూడగలగడం మరి, పెద్ద బలహీనతేమంటే

సిద్ధాంతం లోంచి తప్ప దేనినీ చూడలేక పోవడం, దానికి విరుద్ధమయిన దాంట్లో సత్యం కనపడక పోవడం. ఎంత తర్కంతోనూ, సత్య ప్రదర్శనంతోనూ కూడా కమ్యూనిస్టు విశ్వాసాన్ని చలింపజెయ్యలేము. అదే వాళ్ళ బలం.

మధుర: కమ్యూనిజానికి తిరుగు లేదంటారు. అవునా?

చలం: కాని, ప్రపంచ చరిత్రలో యెంతగట్టి విశ్వాసాలూ, వాటి గుడ్డి తనంవల్ల అవే బద్దలై, నూతన సత్యాలకి దారితప్పుకుని ఊడ్చుకుపోయినాయి.

మధుర: శ్రీశ్రీ మహాప్రస్థానానికి మీరు రాసిన పీఠిక అన్నం కంటె ఆవకాయ ఎక్కువయినట్లు..

చలం: కొంచెం ఆవకాయతో కంచంలో మర్డర్ జరిగిన యింప్రెషన్ కలిగించొచ్చు అలాగే నా చిన్న పీఠికతో పాఠకులకి శ్రీశ్రీ మహాప్రస్థాన మహాద్వారాన్ని తెరిచాను

మధుర: మరి గూటాల కృష్ణమూర్తి లండన్లో వేసిన రు 750/- మహాప్రస్థానంలో మీ యోగ్యతా పత్రం లేదని మీకు తెలుసా? అది తీసెయ్యడానికి శ్రీశ్రీ వప్పుకున్నారు కారణం? చదివేవారు బతికి లేరట

చలం: మహాప్రస్థానం ఏడువందలేబై రూపాయలా?

మధుర: అదంతా లండన్ గొడవ అందులో మీ యోగ్యతా పత్రం లేదని ఆంధ్రదేశంలో అంతా దెబ్బలాడారు, చలం పీఠికలేని మహాప్రస్థానం ఏవిటని

చలం: కమ్యూనిస్టులకి సెంటిమెంట్లు వుండవు

మధుర: 'అసలు నాకా ఉద్దేశమే లేదు ఇదంతా జరుక్శాస్త్రి పురమాయింపు' అన్నారు శ్రీశ్రీ; ఎటూ చెప్పలేక!

మధురవాణి: శ్రీశ్రీకి యోగ్యతాపత్రం యిచ్చాక కమ్యూనిస్టులంతా మీతో బాగానే వున్నారుగా? తర్వాత ఎందుకు బెడిసింది?

చలం: నా 'కొత్త చిగుళ్ళు' అనే కథలో భిక్షువర్షీయసిలోని ముసలమ్మకు ఓ అక్క-దానికోకూతురు. అది సీమటపాకాయలా చాలా చలాకీ - అది చదివేక శ్రీశ్రీ కన్నా కమ్యూనిస్టులకు కోపం ఎక్కింది అప్పుడు వాళ్ళ తృప్తికి శ్రీశ్రీ నా కొత్త చిగుళ్ళకు జవాబుగా 'హేమంతం' అనే పేలవమైన కథ రాశాడు. కథ నా Forte.

మధుర: చలం కలం విశృంఖలం అని తెలియక కాబోలు-

చలం: నేను వాళ్ళ అక్కనీ, ఆ వర్గాన్నీ చాలా వేళాకోళంతో అవమానించాననుకున్నారు నా సౌందర్య పిపాసకి వాళ్లంతా అపస్వరాలన్నాడు శ్రీశ్రీ. మొపాసాని టాల్స్టాయ్ చివాట్లు పెట్టినట్టు భిక్షువర్షీయసి చేత నాకు చివాట్లు పెట్టించాడు శ్రీశ్రీ.

మధుర: మీ నిరీశ్వరవాదం ఎప్పుడు మొదలయింది?

చలం: రవి మరణంతో; 1929లో

మధుర: మీ రచనలు కొన్ని అనువాదాలూ అనుసరణలూవున్నాయని మూలం ఫలానా అని చెప్పలేదనీ మీమీదో ఆరోపణ వుంది

చలం: దైవమిచ్చిన భార్యపై వెల్స్, పాల్ కెయిన్‌ల 'పాషనేట్ ఫ్రండ్స్' 'వుమెన్ దొగివెస్ట్‌మి' ల ప్రభావాలు వున్న మాట నిజం. నా ఆశయాలకు ఆలోచనలకు దగ్గరగా వున్న వాటినన్నీ తీసుకున్నా ఫ్రెంచి నవలా రచయిత మార్షల్ ప్రస్ట్, జర్మన్ నవలా రచయిత డబ్బునిన్ హెర్మిన్‌ల నుంచి కూడా ప్రేరణ పొందాను ఇబ్సెన్, షా, రస్సెల్‌ల రచనలు అవుపోశనం పట్టా - ప్లేటో, రూసో, మార్క్స్, బర్కిలీ మొదలయిన రాజకీయ సాంఘిక శాస్త్రవేత్తలందరినీ చదివా వర్డ్స్‌వర్త్, కీట్సు, బైరన్, షెల్లీల కవితా స్రవంతులు తనివి తీరగా గ్రోలాను అయితే ట్రాజడీ ఏమిటంటే - చెప్పమంటావా?

మధుర: అయ్యో, దాపరికం దేనికి, చెప్పండి

చలం : మన సాహిత్యంలో అభిప్రాయాల్లో ఆలోచనల్లో కొత్త మార్గాన్ని తొక్కిన వాళ్ళలో నేనొకణ్ణే అయితే, నేను నారచనల్లో మూలం ఫలానా అని రాసినా పబ్లిషర్లు దాన్ని తీసెయ్యడం-అచ్చులో అన్నీ సొంతాలుగా రావడం జరిగాయి ఇందు వలన చలం పెద్ద దొంగ అని మీరంతా అనుకున్నారు మీ పేరుతో వస్తే చాలు అనేవారు ప్రచురణకర్తలు చివరకు విసిగి నేను పట్టించుకోవడం మానేసా

మధుర: మీ అమ్మాయికి సౌరిస్ అని కొత్త పేరు ఎలా వచ్చింది?

చలం: నీకు మధురవాణి అనే పేరు ఎలా వచ్చింది?

మధుర: తెలీదు చెప్పండి వింటా

చలం: అలనాటి నాటకం విప్రనారాయణలో దేవదేవి అక్కగారు మధురవాణి అక్కడ్నుంచి లాగారు అప్పారావుగారు అల్లాగే 'సౌరిస్' అనేది ఒక ఆంగ్ల నవలలోని ఫ్రెంచి కథానాయిక పేరు

మధుర: 1921 చాలముఖ్యమటగా, మీ జీవితంలో?

చలం: ఔను ఆఏడాది ఏప్రిల్ 13న సౌరిస్ పుట్టింది హాస్పెటల్‌లో వుండగా నా మొదటి నవల శశిరేఖ రాశా ముద్దు కృష్ణతో కలిసికొన్నాళ్ళు 'జ్వాల' పత్రిక నడిపా ఈ కాలంలోనే వొయ్యెకీ, డాక్టర్ రంగనాయకమ్మకీ వీలుగా వుంటుందని మకాం బెజవాడకి మార్చాను రంగనాయకమ్మ గారి ఆసుపత్రి భర్తృహీనలకు సంఘ బహిష్కృతలకు ఎంతో మందికి ధర్మశాల నాభార్య టి మొదటి మహిళా జీవిత భీమా ఏజెంటు నేను నాస్టూడెంట్సుతో కలిసి నాటకాలు వేస్తూ వుండేవాణ్ని

మధుర: దీక్షితులు గారూ నాయుడుగారూ కాకుండా మిమ్మల్ని ప్రభావితం చేసిన మూడవ వ్యక్తి ఎవరు?

చలం: ఇంకెవరు? భగవాన్ రమణ మహర్షి

మధుర: ఖద్దరు కట్టారా ఎప్పుడన్నా?

చలం: ఏలూరి నుంచి గుంటూరుకి బదిలీ అయితే మాస్టర్లంతా ఖద్దరు కట్టి గవర్నర్‌ను చూడ్డానికి వెళ్తే, నేను మాత్రం ఆడవాళ్ళు వేసుకునే జంపర్ వేసుకుని వెళ్ళా.

మధుర: పై ఉద్యోగులకి ఒళ్ళు మండదా? (నవ్వు)

చలం: మండాలనే (నవ్వు) వెంటనే నరసరావుపేటకు బదిలీ!

మధుర: ఎందుకీ రొష్టూ అల్లరీ?

చలం: అధికార్లకూ నాకూ చుక్కెదురు సరైన సూట్లు వేసుకుంటాననీ, ఎక్కువగా నవ్వుననీ, అరవై ఏళ్ళ వాడికి మల్లే నడుస్తాననీ, నా కింది టీచర్లనీ జవాన్లనీ, రోజూ చివాట్లు క్రమంగా వేస్తూవుంటాననీ, జీవితంలో బాధల్ని గురించి, నా గతీ సంగతీ రోజుకి మూడుసార్లు కనపడ్డ వారితో ఏడుస్తాననీ, వార్తలు చేసొచ్చారు నా తరుపున, నాకీ పని తెప్పించేందుకు

మధుర: మీకెప్పుడూ ప్రమోషన్ రాలేదా?

చలం: రాకేమి? 1924లో రాజమండ్రి నుంచి బందరు ప్రమోషన్ మీద వెళ్ళి - అక్కడ అహోబలరావుతోను, జంగం కోటయ్యు దేవర " డుకు సుబ్రమణ్య దేవరతోనూ స్నేహం చేశా

మధుర: బందర్ వెళ్లాక ఏదో ఒక గొప్ప పని చెయ్యకుండా ఎవరూ వూరుకోలేదు మీరక్కడేం చెయ్యలేదా?

చలం: చెయ్యకేమి? బందర్ నోబుల్ కాలేజిలో యింటర్ నేషనల్ బ్రాంచీలో Man & Woman అనే పెద్ద ఆంగ్ల వ్యాసం చదివా అదే 'స్త్రీ' రచనకు ప్రారంభం

మధుర: మధ్య తరగతి నైతిక విలువల్ని షాక్ చెయ్యటమంటే మీకు సరదా అనుకుంటా?

చలం: సరదా కాదు కసి అయితే మైదానం ఒక ఆర్టిస్టిక్ పీస్ దానిలో షాకింగ్ గుణం చాలా సెకండరీ

మధుర: మిమ్మల్ని గోపీచంద్‌గారు విమర్శించాడనుకుంటా - మీ స్త్రీ పాత్రలకు ఆర్థికమైన సమస్యలేవీ పట్టక పోవడం వెలితి కాదా?

చలం: గోపీచంద్ కోతి నాకు నేను సిన్సియర్‌గా వుండటానికి ప్రయత్నిస్తాను I have no stakes, ఎటు మొగ్గినా, దేంట్లో కలిసినా, ఏం నమ్మినా నాకు వచ్చే నష్టాలేవీ లేవు ఏ పట్టీ కొట్టడానికీ నేను సిగ్గుపడను నాకు వాస్తవమని నిశ్చయంగా తోచాలి

మధుర: మీలో అశాంతికి కారణం?

చలం: లోకానికి నాకూ ఏదో సరిపడని సంబంధం ఏర్పడింది. నాకన్న గొప్ప దాంట్లో దేంటోనో లయమైపోతే బావుంటుందనిపిస్తుంది కాని అదేదో కనపడదు

మధుర: మీకు కాశీలో సంస్కృత విద్యాలయ మందిర్ ఏదో బిరుదిచ్చిందట?

చలం: 'సాహిత్య మనీషి' అన్నారు బిరుదులూ సన్మానాలూ సభలూ అక్కర్లేదని నేను దాన్ని నిరాకరించాను

మధుర: ఈ 'లీల' అంటారెవరు?'

చలం: నా జీవితాన్ని యీ భూమి మీదనే అమృతంలో నింపగల స్త్రీని ఇచ్చారు భగవాన్ నాకు అంతటిలో నాకు తనివి తీరలేదు. లీల దృష్టి వ్యక్తిజీవితపు అందం మీద, నా దృష్టి ప్రత్యేకమైన ప్రయత్నాల విలువల మీద. ఆమె దృష్టి భూమి మీది ప్రపోర్షన్స్ పైన; నా దృష్టి ఆకాశపు Beyond proportions పైన.

మధుర: ఆవిడతో మీకెలా పరిచయం?

చలం: ఆమె తన పదమూడవ యేటనే నా పుస్తకాన్ని చదివి పిఠాపురం స్వగ్రామం కావడంవలన కృష్ణశాస్త్రి ద్వారా నా సాహిత్యం వైపు ఆకర్షితురాలైనా దగ్గరకు వచ్చింది.

మధుర: ఏమైంది చివరకు?

చలం: 'నా వంటి స్త్రీ కోరివచ్చిందంటే ఎటువంటి పురుషుడైనా సెవెన్త్ హెవెన్‌లో వుండే వాడు నీకెక్కడా తృప్తిలేదు. శాంతి లేదు. కృతజ్ఞత లేదు,' అందినన్ను లీల నేను భగవాన్ వైపు మరో ప్లేన్‌లోకి జరిగాను, దానిముందు తను ఇన్‌ఫీరియర్‌గా ఫీల్ అవుతుంది దాంతో ఆమె అహం అధికంగా పైకి లేచి - 1949వ సంవత్సరంలో లీల నన్ను వదలి వెళ్ళిపోయింది.

మధుర: ఎవరు మీకు ఉత్తరం రాసినా జవాబిచ్చేవారట?

చలం: అదొక అలవాటు ఎవరు నాకు రాసినా స్పందించే గుణం నాది.

మధుర: టాగూర్ అంటే మీకు ప్రాణం అనుకుంటా

చలం: టాగూరు కవిత్వం యీ బొమికల్లోకి ఎక్కింది బ్రహ్మ సమాజమూ దేవుడూ భక్తి నన్ను వొదిలి పోయిందాకా, ఒక ఐదేళ్ళు టాగూరు కవిత్వం తాగి బతికాను. ఆయన వ్రాసిన భక్తి నన్ను వొదిలినా కవిత్వం వొదల లేదు . భక్తులకి ప్రేమ గీతాల్లో భక్తి గోచరిస్తుంది నాకు భక్తిగీతాల్లో ప్రేమ గోచరిస్తుంది

మధుర: మీ కెప్పుడన్నా సన్మానం జరిగిందా?

చలం: 1960లో చిత్తూరు నుంచి శారదాపీఠం ఆధ్వర్యంలో కె సభా వందమంది రచయితలతో కళాకారులతో వచ్చి రమణస్థాన్ తిరువణ్ణామలైలో నాకు సన్మానం చేశారు అదే మొదటిది

మధుర: ఆనందం అంటే ఏమిటి?

చలం: నరాల సంచలనం. స్త్రీ నించి పొందే ఆనందాన్ని ఆకాశపు నీలత్వంలోంచి, నీళ్ళ చల్లదనంలోంచి, గడ్డి మెత్తదనంలోంచి, పువ్వుల మెరుగులోంచి పొందాలి

మధుర: సుఖం దేనికి?

చలం: స్వేచ్ఛ లేని సుఖంలో మనిషి నిలవలేడు తనస్వంత సుఖాల్ని తనలోపల్నుంచి కట్టుకోవాలి మానవుడు లోకంలో మనం ఏర్పరచే సుఖపద్ధతి జంతు ప్రదర్శనశాల జంతువులకిచ్చినంత సుఖాన్ని యిస్తుంది

గుడిపాటి వెంకటచలం

మధుర: మిమ్మల్ని ఆనందోపాసకులు అనవచ్చా?

చలం: మనిషిలో ఎట్లా వుందో, ఎందుకు వుందో అతని లోపలే గొప్ప ఆనందం వుంది. అయితే ఒకప్పుడు లోపలి ఆనందాల్ని పై వస్తువుల సహాయంతో అనుభవిస్తున్నాడు లోపలి ఆనందాన్ని అందుకుంటే జీవితం ప్రతి నిముషం ఆనందమయం కాదా?

మధుర: భావకవులు తీసుకొచ్చిన అమలిన శృంగారం గురించి మీరేవంటారు?

చలం: మధురవాణి అనే వేశ్యారత్నం అమలిన శృంగారం గురించి అడగటమా? నేను మీ పక్షమే భౌతికం కాని కేవల మానసిక శృంగారాన్ని నేను నిరసిస్తాను. ఎందుకు బ్రతుకుతున్నావు అంటే ప్రేమించేందుకు, ప్రేమని వెతుక్కునేందుకు అని చెప్పగలగాలి

మధుర: కాలం దేశంవల్ల నీతులూ ధర్మాలూ మారతాయా?

చలం: అంతరాత్మే నీతికి ప్రమాణం ఏ మనిషి కామనిషికి ఏది తనకి ధర్మమో, కర్తవ్యమో స్పష్టంగా తెలుస్తూనే వుంటుంది. స్వార్థం నుంచి దూరమైన కొద్దీ వున్నతుడవుతాడు మనిషి నీకులా-

మధుర: నన్నెందుకు పొగడ్డం?

చలం: నీకున్న క్లారిటీ (స్పష్టమైన అవగాహన) నాకు లేదు. లీల గారి కంటె నువ్వే ఎన్నో రెట్లు నయం నీకు అహంకారం అడ్డం రాదు. పోనీ నువ్వు నాతో వచ్చేస్తావా?

మధుర: నేను మీతో వచ్చేస్తే అక్కడ మా అమ్మకి గడవడం ఎల్లాగ?

చలం: పోనీ మీ అమ్మని కూడా మనతో వుండమంటే-

మధుర: ఆమె రాదు చెడినవారిని యింకా చెడగొట్టవద్దని మా తల్లి ఆదేశం.

చలం: ఎవరో సత్పురుషుడు కాలుజారగా పుట్టిన పిల్లవై యుంటావన్నాడు సౌజన్యారావు పంతులు నిన్ను.

మధుర: మీరే వంటారు?

చలం: నిన్ను చూశాక కాల్జారకుండా వుండటం అబ్సర్డ్ అంటాను

మధుర: (నవ్వి) ఈ ఒక్కటీ చెప్పండి దేన్ని సౌందర్యం అనొచ్చు?

చలం: నరాల్ని నీలా అందంతో లాగి బాధించేది. ఏదో రహస్యమైన ఆకర్షణ, ఏ నడకో, ఏమాట మాధుర్యమో, ఏ కామవిస్ఫురణో నీకు దాసుల్ని చేసుకుంటాయి.

మధుర: నన్ను పట్టించారేవిటివ్వాళ?

చలం: పోలికలకూ, ఉపమానాలకూ అందని నీ స్వభావం ఆత్మకు సంబంధించినదై వుంటుంది. గొప్ప ఆత్మ లేకుండా గొప్ప సౌందర్యం యెక్కడ? సౌందర్యానికి అంధులు కావటం కన్నా సౌందర్యం మామూలయి పోవటం కన్నా మృత్యువు వేరే లేదు.

మధుర: సౌందర్యాన్ని పూజిస్తూ కూచుంటే నవ్వరా?

చలం: శృంగార భావం, సౌందర్య తృష్ణ మలినమే అయితే నేనూ మలినుణ్నే. స్త్రీ చవక కావడం వల్ల స్త్రీ సౌందర్యాన్ని పూజించటం మానేశారు.

మధుర: కవిత్వానికీ కవికీ వుండే సంబంధం?

చలం: దీపానికీ కాంతికీ వుండే సంబంధం వంటిది.

మధుర: కొత్త కవులు కూడా పాత వర్ణనలూ కవి సమయాలూ, పాటించడం?

చలం: మతం పేరిట ఏ వికృతమయినా చలామణి ఐనట్టే కవిత్వం పేరిట అసందర్భమైనా మెప్పు పొందుతుంది.

మధుర: కళకు సామాజిక ప్రయోజనం చాలదా?

చలం: అంతకు మించిన ప్రయోజనం వుంది. అది రసానుభవం ఇది గుర్తించ నిరాకరించినందువల్లే అభ్యుదయ కవిత్వ ఉద్యమం చచ్చింది.

మధుర: పాపం కమ్యూనిస్టులు తలపెట్టిన అభ్యుదయ రచయిత ఉద్యమం చివరకేమయింది?

చలం: కళకి ఉద్దేశం ఉండాలి, ప్రజాసేవ చెయ్యాలి-అని ఆందోళన పడిన కొద్దీ అందానికి దూరమవుతున్నారు రచయితలు. దూరమే కాదు విరోధులవుతున్నారు. ప్రతి రసపుష్టిగల రచయితనీ కళనీ విరోధి అని చండాడారు చివరకా ఉద్యమం చచ్చింది.

మధుర: కమ్యూనిజంలో కళ(లు) ఎలా వుంటాయి?

చలం: అక్కడ వ్యక్తిగతమైన స్వేచ్ఛ ఒప్పుకోరు. కళాకారుడికి స్వేచ్ఛ లేదు అందుకనే అక్కడి కళలో టెక్నిక్‌లు ఎక్కువా రసం తక్కువాను. కళని సృష్టించే ఆర్టిస్టులూ, దాన్ని పూర్తిగా అనుభవించే మనుషులు వారు ఒక కల్చరల్ అరిస్టోక్రసీ ఏ అరిస్టోక్రసీని అంగీకరించని దేశంలో కళ విజృంభించదు.

మధుర: ఐతే గొప్ప కళ ప్రజాబాహుళ్యంపై ఏ మార్పు తేలేదా?

చలం: కొందరి మీద పనిచేస్తుంది. కొందరి మీద ఏ ప్రభావం వుండదు. ప్రజా బాహుళ్యంపై ఏ మార్పూ తీసుకుని రానట్టు పైకి కనిపించినా, కనిపించని లోతైన మార్పు జరగడం గమనించవచ్చు.

మధుర: విద్యావిధానం గురించి మీ అభిప్రాయాలు...

చలం: విద్య అంటే ఆనందించే శక్తిని వృద్ధి చెయ్యటం సౌందర్యానికి కళ్ళు తెరవడం, బాధల్నించి కష్టాల్నుంచి తప్పించుకునే నేర్పునివ్వడం, ఇతరుల స్వేచ్ఛల్ని అడ్డగించే స్వార్థపరత్వం నించి, అంతా తనకే కావాలని దాచుకునే కాపీనం నించి, భయాలు నించి తప్పించడం.

మధుర: నేటి విద్యావిధానం గురించి నేనడుగుతా-

చలం: రాజకీయాలతో పెనవేసుకుని వుండడం వల్ల రాజకీయాలూ ప్రభుత్వపు పాలసీ పరిశుద్ధమైతే గాని విద్యా విధానం చక్క బడదు. మలేరియా, క్షయ, దారిద్ర్యం, కుష్టు కల్పించిన శక్తులే మానవజాతికి యీ విద్యావిధానాన్ని, వివాహ సంస్కారాన్ని కటాక్షించినాయి.

మధుర: ప్రశ్నించే మనస్తత్వం అయితే వుంది కాని మీకు మీదైన తాత్విక పునాది ఏదీ లేదు అంటారు. నిజమా?

చలం: ప్రశ్నించడం ఎందుకా? నాది అట్లాటి మనసు. ఎప్పుడూ ప్రశ్నిస్తుంది. సత్యం? సత్యం ఏమిటి ఎక్కడ వుంది? అన్నది అనాదిగా వొస్తున్న ప్రశ్న. ఈ ప్రశ్నని పట్టుకుని జీవితాన్ని తరచాలి. కబీర్ అమృతానుభవం. టాగూరు భక్తి ప్రణయం, భగవాన్ అద్వైతభావం అన్నీ సత్యాలే. చాలా వరకు ఆధ్యాత్మిక విద్య అంటే సబ్‌కాన్‌షస్‌ని తరచడం లాగ తోస్తుంది. చెట్టు కాలం ఫలితంగా పువ్వులు పూసినట్లు ఏ కొద్ది మందిలోనో వికసిస్తుంది, గొప్ప అందం, ఆదర్శం. ద్వేషించినా ప్రపంచం వాళ్ళ అడుగుజాడల్లో ముందుకు సాగుతుంది. నిరంతరం మానవజాతిని నిలవనీక, నిద్రపోనీక, వెతికించే ప్రోద్బలమే నా రక్తంలోనూ పలుకుతోంది. అన్వేషణలన్నీ నిరర్థకాలూ అబద్ధాలూ అయితే నాయత్నమూ అంతే

మధుర: మీ అన్వేషణ ఎక్కడికి?

చలం: నీ పెదవుల్నీ కళ్ళనీ చేతుల్నీ నావాటిని చేసుకోలేను, నిన్ను కావిలించుకోగలను అంతే

(చలం మధురవాణిని కావిలించుకుంటాడు. ఆమె చలాన్ని ముద్దు పెట్టుకుంటుంది గాఢంగా)

చలం: క్షణాలని నమ్మిపరిగెత్తి పోయే స్వల్ప ఆనందాలతోనే సుఖపడదాము. ఏదో వొరుగుతుందని నమ్మి మాడిచావనీ వేదాంతుల్ని.

మధుర: నేను అంటే మధురవాణి వుండదు. అంటే లోకమే వుండదు. ఎట్లా వుంటుంది నేను లేకపోయింతరవాత? కాని వుంటుందే? మరియెట్లా వుంటుంది?

చలం: జీవితం మీద మనసుకి అంత ఆసక్తి వుంది. అంత అనురాగం వుంది. అందువల్లనే 'నేను లేకపోతే లోకం యేదీ' అనే అహంభావం

మధుర· అంతేనా?

చలం: అవును అంతే - ఏదీ ఒక చిన్న ముద్దు... ★

(మిసిమి - నవంబర్ 1991, జనవరి 1992)